

కార్యదర్శుల జీవితాల్లో వెలుగులు

- పంచాయతీ అభివృద్ధి అధికారులుగా కార్యదర్శులు
- క్లస్టర్ వ్యవస్థ రద్దు ● పెరుగుతున్న జీతాలు
- పనుల విభజన కోసం ప్రత్యేక విభాగాలు
- సంస్కరణ బాట పట్టిన పంచాయతీ రాజ్

పంచాయతీ రాజ్ దీపానికి కూటమి ప్రభుత్వం చమురు పోసి గ్రామజ్యోతి వెలిగించింది. అధికారంలోకి వచ్చాక ఆశాఖను సంస్కరణ బాటను పట్టింది. పంచాయతీ కార్యదర్శుల జీవితాల్లో వెలుగులీననున్నాయి. ఇకపై ప్రతి పంచాయతీ స్వతంత్ర పరిపాలన వ్యవస్థగా పని చేయనున్నాయి. క్లస్టర్ వ్యవస్థ పూర్తిగా రద్దు కానుంది. ఈమేరకు పంచాయతీరాజ్ శాఖ సమూల మార్పులను ప్రతిపాదిస్తూ జీవో.నెం.91 విడుదల చేసింది. పంచాయతీ కార్యదర్శి పేరును కూడా పంచాయతీ అభివృద్ధి అధికారిగా వ్యవహరించనున్నారు. గతంలో కార్యదర్శుల కొలువు అంటే ఉసురుమనిపించేలా ఉండేది. నేడు పంచాయతీరాజ్ శాఖలో పండుగ వాతావరణం నెలకొంది.

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 973 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిని స్పెషల్ గ్రేడ్ రూర్బన్ పంచాయతీలుగానూ, గ్రేడ్ 1, 2, 3లుగా వర్గీకరించారు. రూర్బన్ గ్రామ పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవో స్థాయి అధికారులను నియమిస్తారు. ఇవి ఉమ్మడి కర్నూలు జిల్లాలో 25ఉన్నాయి (కర్నూలు 19, నంద్యాల 6). ప్రస్తుతం ఆరు గ్రేడ్లుగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు ఇకపై మూడు గ్రేడ్లుగా మారనున్నారు. పంచాయతీ కార్యదర్శి పేరును కూడా పంచాయతీ అభివృద్ధి అధికారిగా వ్యవహరించనున్నారు.

గత ప్రభుత్వంలో..

గత ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో దాదాపు 400 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులను నియమించారు. డిగ్రీ అర్హత కలిగిన వీరికి జూనియర్ అసిస్టెంట్ స్థాయి వేతనం ఇవ్వాల్సి ఉండగా రికార్డు అసిస్టెంట్ స్థాయిలో జీతమిచ్చి వారి జీవితాలతో ఆడుకున్నారు. ప్రస్తుతం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల వేతనం రూ.23,120 ఉండగా వారందరినీ గ్రేడ్-3 కార్యదర్శులుగా మారుస్తూ రూ.28,120 స్కేల్ ఇవ్వనున్నారు. 2007లో పీజీ అర్హతతో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో రూ.3వేలు వేతనం చెల్లించి పంచాయతీ కార్యదర్శులను నియమించారు. వారందరి ఉద్యోగాలు క్రమబద్ధీకరించినప్పటికీ వేతనాలు తక్కువ స్థాయిలో ఉండేవి. ప్రస్తుతం వారందరినీ గ్రేడ్-2గా మారుస్తూ రూ.32,670 కనీస వేతన స్కేల్ ఇవ్వనున్నారు. ఇక పదోన్నతులు పొంది తక్కువస్థాయి వేతనాలు పొందుతున్న గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు ఇకపై రూ.44,570 స్కేల్ ఇవ్వనున్నారు. రూర్బన్ పంచాయతీలో పనిచేయబోయే డిప్యూటీ ఎంపీడీవో స్థాయి అధికారులకు రూ.45,830 కనీస వేతనం కేటాయించారు.

ప్రత్యేక సిబ్బందిని..



గతంలో గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి మాత్రమే ఉండేవారు. అన్ని విభాగాల పని ఒక్కరే పర్యవేక్షిస్తుండటంతో పనిభారం ఉండేది. సచివాలయ వ్యవస్థకు డీడీవోగా వ్యవహరించాల్సి రావడంతో పనిఒత్తిడి శాపంగా మారింది. ప్రస్తుతం తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా ఇకపై గ్రామ పంచాయతీలో పారిశుధ్యం, నీటి సరఫరా, గ్రామ ప్రణాళిక, రెవెన్యూ విభాగం ఏర్పాటుతో ప్రత్యేక సిబ్బందిని నియమించ నున్నారు. సచివాలయంలో పని చేస్తున్న ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లను ఇకపై కంట్రీ ప్లానింగ్ అసిస్టెంట్లుగా మార్చనున్నారు. పంచాయతీల్లో ఐటీ విభాగాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 973 పోస్టులు

ఉమ్మడి జిల్లాలో 973 పంచాయతీ కార్యదర్శుల పోస్టులలో కర్నూలు జిల్లాలో స్పెషల్ గ్రేడ్-19, గ్రేడ్-1 కేటగిరి కింద 140, గ్రేడ్-2 కింద 133, గ్రేడ్-3 కింద 192 కాగా.. నంద్యాల జిల్లాలో స్పెషల్ గ్రేడ్-6, గ్రేడ్-1 కేటగిరి కింద 111, గ్రేడ్-2 132, గ్రేడ్-3 237 పోస్టులు కల్పించనున్నారు.

పరస్పర పదోన్నతులు పొందే..

గతంలో మినిస్టీరియల్ విభాగాల్లో పనిచేసే జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులుగా వచ్చే అవకాశముండేది. పంచాయతీ కార్యదర్శులుగా పని చేసేవారు మినిస్టీరియల్ అధికారులుగా వెళ్లేందుకు అవకాశం ఉండేది కాదు. ప్రస్తుతం అటూ ఇటు మారేందుకు పరస్పర పదోన్నతులు పొందే అవకాశాలు పంచాయతీ కార్యదర్శులకు కల్పించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క పదోన్నతి కల్పించకపోగ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 550కి పైగా పదోన్నతులు కల్పించారు.

సంస్కరణలను స్వాగతిస్తాం



పంచాయతీ రాజ్ శాఖలో తీసుకొస్తున్న సంస్కరణలను స్వాగతిస్తున్నాం. వేతన సవరణ అనేది ఓ విప్లవాత్మకమైన మార్పు. జీతాలు పెరుగుతాయి. జీవితాలు బాగుపడుతాయి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

● కే.గిరి శ్రీకాంత్, కన్వీనర్, నవీన పంచాయతీ కార్యదర్శుల సంఘం

నేడు 'డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ'



కల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఆసంస్థ సీఎండీ శివశంకర్ తెలిపారు. ఈమేరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సెల్ నెంబరు: 8977716661, చాట్ ఫిర్యాదు నెంబరు-9133331912కు ఫోన్ చేయాలన్నారు. తిరుపతి, చిత్తూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, నెల్లూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాల వినియోగదారులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బియ్యపు గింజలతో పరమేశ్వరుడు



నంద్యాలకు చెందిన చిత్రకారుడు కోటేశ్ కార్తీక మాసం చివరి సోమవారం పురష్కరించుకొని చేతిలో బియ్యపుగింజలు తీసుకొని పలకమీద పోస్తూ చేతివేలితో ఆబియ్యాన్ని క్రమంగా సరిచేస్తూ శివుని ఆకృతిని తయారు చేశాడు. శివుడికి ప్రీతికరమైన కార్తీకమాసం సందర్భంగా భక్తులు చివరి సోమవారం శివయ్యను భక్తితో కొలిస్తే విశేష ఫలితాలుంటాయన్నారు. కుంచె లేకుండా, రంగులు లేకుండా, స్కెచ్ లేకుండా



చేతిలో బియ్యపు గింజలను తీసుకొని పలకమీద పోసి చేతి చూపుడు వేలితో బియ్యపు గింజలను క్రమంగా సరిచేస్తూ ఆశివయ్య రూపం చూపిస్తూ గంగాదేవి, సిగలో నెలవంక, మెడలో నాగరాజు, త్రిశూలం, ఓం ఆకారం, కార్తీక ప్రమిదలు, ఉన్నట్లు వేశారు చిత్రకారుడు కోటేశ్ .

● నంద్యాల కల్చరల్, ఆంధ్రజ్యోతి

ముంచిన అరటి

- టన్ను రూ.2వేలకు పడిపోయిన ధరలు
- గొర్రెలకు మేతగా వదిలేసిన గెలలు
- లబోదిబోమంటున్న రైతులు

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్నదాతను అరటి తోటలు అమాంతం ముంచేశాయి. ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. పెట్టుబడి కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని చిన్నవంగలి గ్రామం లో రైతులు కొండారెడ్డి, లక్ష్మీరెడ్డి నాలుగెకరాల్లో సాగుచేసిన అరటి తోటలను ధరలు లేక వదిలేశారు. ప్రత్యామ్నాయ పంట సాగు చేసేందుకు అరటి గెలలు కోత కోసి గెట్ల వెంట రోడ్లపై పడేశారు. దీంతో జీవాలకు మేతగా మారాయి. జీవాల పెంపకందారులు ట్రాక్టర్ల ద్వారా అరటి గెలలను తీసుకెళ్లి మేతగా వాడుకుంటున్నారు. ఎకరా



చిన్నవంగలిలో పడేసిన అరటి పండ్లను తింటున్న గొర్రెలు

పెట్టుబడి రూ.లక్ష దాక ఖర్చు చేశారు. వ్యాపారులు కూడా ముందుకు రావడం లేదు. వచ్చిన టన్ను రూ.2వేలు (కిలో రూ.2)కూడా పలకడం లేదు. రైతులు ఆశలు వదులుకొని ట్రాక్టర్లతో అరటి తోటలను దున్నేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల నూనెపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా ఆన్లైన్‌లో కూడా సమర్పించవచ్చని తెలిపారు. అర్జీ పరిష్కార స్థితి గురించి తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోనూ, టోల్ ఫ్రీ నంబరు 1100 ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.అర్జీదారులు మొదట తమ అర్జీలను మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలోని వేదికకు రావాలని సూచించారు. జిల్లా కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

తెప్పోత్సవం వాయిదా


శ్రీశైలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం పాతాళగంగ వద్ద నీటిమట్టం అధికంగా ఉండటంతో కృష్ణమ్మ ఒడిలో స్వామి అమ్మవార్లకు ఈనెల 18వ తేదీన జరగవలసిన హంస తెప్పోత్సవం తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో నదీతీరాన యాత్రికుల భద్రతా కారణాల దృష్ట్యా తెప్పోత్సవాన్ని నిలిపివేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్‌శాఖ ఉద్యోగులకు పదోన్నతులు

కల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యుత్‌శాఖ అకౌంట్స్ సెక్షన్‌లో పనిచేస్తున్న జేఏవోలకు ఏఏవోలుగా పదోన్నతి కల్పిస్తూ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు కర్నూలు సిటీలో పనిచేస్తున్న అశోక్‌వర్ధన్‌గుప్తాను నందికొట్కూరుకు, నంద్యాలలో విధులు నిర్వ హిస్తున్న సుంకన్నను బనగానపల్లెకు, ఆదోనిలో పనిచేస్తున్న హనుమేష్‌ను విజయ వాడకు, కర్నూలులో విధులు నిర్వహిస్తున్న డేనియల్‌ను ఎమ్మిగనూరుకు బదిలీ చేశారు. కర్నూలులో పనిచేస్తున్న రాఘవను రాయదుర్గం, కర్నూలులో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ క్రిష్ణానాయక్‌ను కళ్యాణదుర్గంకు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లుగా పదోన్నతి కల్పించి సీఎండీ ఉత్తర్వులు ఇచ్చారు.

శ్రీశైలం.. భక్తజన సంద్రం

- కార్తీక మాసం ఆఖరి రోజుల్లో ఆదిదంపతుల దర్శనం
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భక్తులతో కిక్కిరిసిన ఆలయ మాడవీధి



ధ్వజ స్తంభానికి వెలుగుతున్న ఆకాశదీపం

శ్రీశైలం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరి రోజుల్లో భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం నలుమూలల నుంచి వస్తున్న యాత్రికులతో శ్రీశైల క్షేత్రం కిక్కిరిసిపోయింది. వేలాదిగా వస్తున్న భక్తులు స్వామి, అమ్మవార్ల అలంకార దర్శనాలు చేసుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. కృష్ణమ్మలో పుణ్యస్నానాలు, దీపదానాలతో నదీతీరాన శివనామస్మరణ మార్మోగిపోయింది. స్వామి, అమ్మవార్ల సర్వ దర్శనాలకు సుమారు నాలుగు గంటల సమయం పడుతోందని ఆలయ అధికారులు తెలిపారు. వారాంతపు సెలవులతో పాటు నేడు చివరి సోమవారం సందర్భంగా క్షేత్ర పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. క్యూలైన్‌లో వేచి ఉండే భక్తులకు అల్పాహారంతో పాటు పాలు, తాగునీరు అందిస్తున్నారు. సాయంకాలం కార్తీకమాసోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన ధ్వజస్తంభం వద్ద ఈవో శ్రీనివాసరావు ఆకాశదీపానికి ప్రత్యేక పూజలు చేసి భక్తుల దర్శనాలకు అనుమతించారు. అదేవిధంగా అమ్మవారి ప్రాకారోత్సవంలో స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా పల్లకీ సేవ నిర్వహించారు. వివిధ పుష్పాలతో అలంకరించిన పల్లకిలో ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేసి అమ్మవారి ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయ దక్షిణ మాడవీదిలో కళారాధన వేదికపై కూచిపూడి నృత్యాలు అందరినీ అలరించాయి.

మహిమాన్వితం.. నేలబిళం మల్లేశ్వర క్షేత్రం

- నేడు చివరి సోమవారం పూజలకు సర్వం సిద్ధం
- కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తుల రాక



ముస్తాబైన నేలబిళం మల్లేశ్వరస్వామి ఆలయం



పూజలందుకుంటున్న మల్లేశ్వరస్వామి

కొలిమిగుండ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నేలబిళం మల్లేశ్వరస్వామి భక్తుల మహిమాన్విత క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతంలోని కొండల్లో వెలసిన నేలబిళం మల్లేశ్వరస్వామి ఆలయం భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతోంది. అతి పురాతన శైవక్షేత్రాల్లో నేలబిళం మల్లేశ్వరస్వామి ఆలయ చరిత్ర అత్యంత పవిత్ర, ప్రాముఖ్యత కలిగినదిగా లక్షలాది భక్తుల నమ్మకం. మండలంలోని బందార్లపల్లె గ్రామ సమీపాన గుహల ప్రాంతంలో వెలసిన ఈ ఆలయంలో కార్తీక మాసం ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం జరిగే చివరి కార్తీక సోమవారం వేడుకలకు ఆంధ్ర, తెలంగాణ నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి భారీగా భక్తులు తరలిరానున్నారు. కార్తీక మాసం కడ సోమవారం రోజు వేలాది మంది భక్తజన సందోహం మధ్య నిర్వహించే శివ పార్వతుల కల్యాణం, స్వామి వారి రథోత్సవం వైభవంగా జరగనుంది. ఇందుకోసం ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చివరి సోమవారం సందర్భంగా అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి నేరుగా ఆలయం వరకు బస్సులు రాకపోకలు సాగిస్తాయి. కర్నూలు జిల్లా వైపు నుంచి వచ్చే భక్తులు జిల్లా సరిహద్దులోని రాయల్టీ చెక్ పోస్టు వద్దకు చేరుకుంటే అక్కడి నుంచి బస్సులు ఉంటాయి.

సత్ప్రవర్తనతో మెలగాలి: ఎస్పీ

నంద్యాల టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నేర చరిత్ర, రౌడీషీటర్లు సమాజంలో మంచి ప్రవర్తనతో మెలగాలని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మారుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని చెడును వదిలి మంచిగా ఉండాల న్నారు. ఎప్పటికప్పుడు వారి ప్రవర్తనపై ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు తెలిపారు. వారు ఏ పని చేస్తున్నారు. వారికి జీవనోపాధి ఎలా అని అడిగి తెలు సుకున్నారు. నేర చరిత్ర కలిగిన వారు ఎక్కడైనా మళ్లీ నేరాలకు పాల్పడితే చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా నేరాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారమి వ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసులు పాల్గొన్నారు.

వనభోజనాలతో బంధాలు బలోపేతం
కర్నూలు జిల్లా కమ్మసంఘం అధ్యక్షుడు కమ్మ కృష్ణమోహన్

7

నామినేటెడ్ పోస్టుల్లో బలిజలకు ప్రాధాన్యం
వనభోజన మహోత్సవంలో మంత్రి టీజీ భరతి



జలసవ్వడులు

కాల్వకు ఇరువైపులా పచ్చచెట్లు ప్రకృతి రమణీయతను చాటుతున్నాయి. మధ్యలో గంగ ఒడిలో క్రిష్ణమ్మ బిరాబిరా పరుగులు తీస్తూ కడప వైపు వెళ్తుంది. పరిఢవిల్లుతున్న పచ్చదనం నడుమ కాల్వలో క్రిష్ణమ్మ పరుగులు పెడుతుంటే జలసవ్వడులు గల గలా వినిపించసాగాయి. ఎత్తయిన కొండల మధ్య పచ్చని వృక్షాల మధ్య నుంచి క్రిష్ణమ్మ ఒక జాడలా జాలువారుతూ పోతుంది. చూపరులను ఈ దృశ్యాలు మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి.

● రుద్రవరం, ఆంధ్రజ్యోతి

సాహిత్యానికి పురిటిగడ్డ నంద్యాల

● శతావధాని ఆముదాల మురళి ● ఘనంగా పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహిత్యాభిలాషులు, కవులు, రచయితలు

నంద్యాల కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాహిత్యానికి పురిటి గడ్డ నంద్యాల అని ప్రముఖ శతావధాని ఆముదాల మురళి అన్నారు. ఆదివారం నంద్యాలలో వివేకానంద ఆడిటోరియంలో డాక్టర్ వైష్ణవ వెంకటరమణ మూర్తి రచించిన మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతికి చెందిన శతావధాని మురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవనందుల క్షేత్రం నంద్యాలలో నవరసాలు పలికించే ప్రాంతమన్నారు. డాక్టర్ రమణమూర్తి రచించిన నాయనారుల చరిత్ర, ఆళువారుల కథలు, వైష్ణవ శాకుంతలమ్, సాహిత్యాభిమానుల ఆధ్వర్యంలో ఆవిష్కరించడం చాలా సంతోషంగా వుందన్నారు. గతంలో ఆళువార్ల చరిత్ర పద్యకావ్యం రాశారని, ఇప్పుడు ఇప్పుడు నాయనారుల చరిత్రను సులభశైలిలో పద్య కావ్యంలో తీసుకురావడం తెలుగు ప్రజల అదృష్టమన్నారు. ఆధునిక కావ్య జగత్తులో నాయనారుల చరిత్రకు రమణీయస్థానం దక్కుతుందని తెలిపారు. అవధాని గంగుల నాగరాజు మాట్లాడుతూ నాయనార్లు శివ భక్తులుగా ప్రసిద్ధులని శివతత్వంలోని సారాంశాన్ని పుస్తకరూపంలోకి తీసుకురావడం సంతోషదాయకమన్నారు. సుధాకర్‌రెడ్డి, నాగరాజు, బిబిఎస్ ప్రసాదులు ఆళ్వారుల కథలు, నాయనార్ల చరిత్ర, వైష్ణవ శాకుంతలమ్ పుస్తకాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయతలు గంగుల నాగరాజు, కవికోలం మధుసూదన్,గాయకులు శేషాచార్యులు,మహబుబ్ బాషా, అన్నెం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఉదయ శంకర్,శశిభూషణ సిద్దాంతి, నీలం వెంకటేశ్వర్లు, అవ్వారి శేషఫణి, రచయతు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోవాలాలపై ట్రాఫిక్ పోలీసుల కొరడా



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు



కర్నూలు క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆటోలతో స్నేక్ రైడింగ్ చేస్తూ స్టంట్లు, విన్యాసాలు చేస్తున్న ఆటోవాలాలపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. నగర శివారులో ఆదివారం కొంత మంది ఆటోడ్రైవర్లు, స్నేక్ డ్రైవింగ్, స్టంట్లు వేస్తూ వీడి యోలు తీసుకుంటున్నారని పోలీసులకు సమాచారం అందింది. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కొంత మంది ఆటో డ్రైవర్లను ట్రాఫిక్ పోలీసులు గుర్తించి నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా ఆటోలు, బైక్‌లతో స్టంట్లు వేస్తూ, స్నేక్, ర్యాష్ డ్రైవింగ్‌లు చేస్తూ ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తే ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రైతు కష్టం అగ్నికి ఆహుతి

● కాలిపోయిన మొక్కజొన్న, కంది పంట

● రూ.25 లక్షల పంట నష్టం



వడ్డెమాను పొలిమేరలో తగలబడిపోతున్న మొక్కజొన్న పంట

నందికొట్కూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతు నిర్లక్ష్యం వల్ల 36 ఎకరాల మొక్కజొన్న, 4 ఎకరాల కందిపంట అగ్నికి ఆహుతైన సంఘటన నందికొట్కూరు మండలం వడ్డెమాను గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వడ్డెమాను పొలిమేరలో అదేగ్రామానికి చెందిన బోయ కోనేటిస్వామన్న తనకు ఉన్న రెండు ఎకరాల మొక్కజొన్న పంటను కోశాడు. అయితే మరో పంట వేసుకునేందుకు పొలంలో మిగిలిపోయిన మొక్కజొన్న కొయ్యలతో పాటు చెత్తకు నిప్పంటించాడు. అయితే ఆ రైతు పొలం పక్కనే ఇతర రైతులు సాగు చేసిన 36 ఎకరాల్లోని మొక్కజొన్న పంట, నాలుగు ఎకరాల్లోని కంది పంట అగ్నికి ఆహుతైంది. ఇందులో తెలుగురోశన్నకు చెందిన 10 ఎకరాల మొక్కజొన్న, బ్రాహ్మణకొట్కూరు చెందిన అబ్దుల్ రహిమాన్‌కు చెందిన ఏడు ఎకరాలు, ముర్తుజావలికి చెందిన నాలుగుఎకరాలు, ఈశ్వరన్నకు చెందిన ఐదు ఎకరాలు, నూరుల్లా కు చెందిన నాలుగుఎకరాలు, నాగపుల్లన్నకు చెందిన కందిపంట నాలుగుఎకరాల చొప్పున కాలిపోయింది. దీంతో రూ.25 లక్షల మేర పంట నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ తిరుపాలు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

● మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



ఉయ్యాలవాడ విగ్రహావిష్కరణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి బీసీ

బనగాన పల్లె, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా అచంట నియోజకవర్గంలోని మార్టేరులో రెడ్డి సోదరుల కార్తీక వన సమారాధన కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి మంత్రి బీసీ పాల్గొన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సహకరించిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను బీసీ అభినందించారు. మంత్రి బీసీ మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలోని కోవెలకుంట్ల పరిసరాల్లో ఎన్నో ఉద్యమాలు చేపట్టిన యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అన్నారు. రాయలసీమలో పుట్టి బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా పోరాటం చేసిన నరసింహారెడ్డి విగ్రహం ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవకారుడు అని కొనియాడారు. కోవెలకుంట్లలోని కుందూ నది ఒడ్డున ధైర్యంగా ఉరికంబం ఎక్కి దేశభక్తిని చాటుకున్నారని కొనియాడారు. ఊరిపేరునే ఇంటిపేరుగా మార్చుకున్న వ్యక్తి నరసింహారెడ్డి అని కొనియాడారు. అలాగే ఎన్నో గొప్పదానాలు, అన్నదానాలు చేసిన మహో వ్యక్తి బుడ్డా వెంగళరెడ్డి అని అన్నారు. యోగి వేమన రచనలు సమాజంలోని మంచి చెడులను చక్కగా వివరించారన్నారు. ఇలాంటివారిని స్ఫూర్తిగా తీసుకొని ఐక్యంగా ఉండాలని బీసీ అన్నారు.

రాయలసీమ పౌరుషం చాటుదాం



అభివాదం తెలుపుతున్న రాయలసీమ నాయకులు

● శ్రీబాగ్ ఒప్పందం అమలుకై తాడోపేడో

● రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీబాగ్ ఒప్పందం అమలు కోసం రాయలసీమ పౌరుషాన్ని చాటాలని రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. 88 సంవత్సరాలైనా అమలు కాని శ్రీబాగ్ ఒప్పందంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఆదివారం కర్నూలు నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో రాయలసీమ మేధావులు, నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన మద్దతుదారులతో సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం చరిత్రలో కలుక్కుమంటున్న జ్ఞాపకం అన్నారు. రాయలసీమకు జరిగిన అన్యాయం నిలువెత్తు నిదర్శమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడుల కోసం పారిశ్రామికవేత్తలతో కోట్ల రూపాయలతో ఒప్పందాలు చేసుకుంటున్నారని, ఇదే మాదిరిగానే రాయలసీమ ప్రయోజనాల కోసం శ్రీబాగ్ ఒప్పందం జరిగిందన్నారు. ఈ ఒప్పందాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ఘాటుగా ప్రశ్నించారు. నీటిపారుదల విషయంలో రాయలసీమకు 10 సంవత్సరాలు పాటు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కృష్ణ, తుంగభద్ర, పెన్నా నదుల నీటి వినియోగంలో భారీ పథకాలు రాయలసీమ కోసం కేంద్రీకరించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ, కోస్తా జిల్లాలకు సమాన సంఖ్యలో శాసనసభ స్థానాలు కేటాయించాలన్నారు. రాజధానిని, హైకోర్టు, రాయలసీమ వాసులు దేనినైతే కోరుకుంటారో దానినే రాయలసీమలో ఏర్పాటు చేయాలన్నారు. కోస్తాంధ్ర, తెలంగాణ కంటే రాయలసీమ వెనుకబడి ఉందని రాష్ట్ర విభజనకోసం వేసి శ్రీకృష్ణ కమిటీ కూడా చెప్పిందని ఆయన గుర్తు చేశారు. రాయలసీమ వాణి ఢిల్లీకి వినిపిద్దామని... ఢిల్లీ పీఠం దద్దరిల్లేలా మహాస్వరంతో పొలికేక వేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర సాధనకు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి నాయకులు కారుకూతలు మానుకుని రాయలసీమ ప్రయోజనాల కోసం పని చేయాలని హితవు పలికారు. తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకు శ్రీబాగ్ ఒప్పందానికి పోరాడుతూనే ఉంటానని కుంచం స్పష్టం చేశారు. ఈ సభలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, రాయలసీమ రాష్ట్ర సమితి మైనార్టీ నాయకుడు ఖాదర్‌వలి, బి.ముష్కిన్, సుభాన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ఖాశీం వలి, మీడియా కోఆర్డినేటర్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాలతో బంధాలు బలోపేతం



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కమ్మసంఘం నాయకులు

కర్నూలు జిల్లా కమ్మసంఘం అధ్యక్షుడు కమ్మ కృష్ణమోహన్

కర్నూలు కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక వనభోజనాలతో కులబంధాలు, కుటుంబ సంబంధాలు బలోపేతం అవుతాయని కర్నూలు జిల్లా కమ్మసంఘం అధ్యక్షుడు కమ్మ కృష్ణ మోహన్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరం నందికొట్కూరు రోడ్‌లో ఉన్న కాకతీయ కమ్మ సంఘం ప్రాంగణంలో కమ్మసంఘం ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజనం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు వేల మంది కమ్మ కులస్థులు హాజరయ్యారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు కమ్మ కృష్ణమోహన్ మాట్లాడుతూ కార్తీక వనభోజనాలతో ఏడాదిలో ఒక్కసారైన కులస్థులు ఒక్కచోట కలిస్తే బంధాలు, బంధుత్వాలు మెరుగవుతాయన్నారు. కమ్మ కులస్థులు సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇతర కులాల్లో ఉన్న పేదలకు సైతం సహకరించేలా ప్రతి ఒక్కరూ ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థి దశ నుంచే మంచి లక్షణాలను అలవర్చుకుని, ఉన్నత స్థానాలకు ఎదిగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 2026 కమ్మసంఘం నూతన క్యాలెండర్‌ను జిల్లా కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. అదేవిధంగా మహిళలు, చిన్నారులకు వేర్వేరుగా క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. వేదికపై మిమిక్రీ, మ్యాజిక్ కళాకారులు తమ ప్రదర్శనతో మెప్పించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం జిల్లా కార్యదర్శి పెరికలపాటి రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు జంపాల మధుసూదన్, కూసుపాటి బాబ్జి, లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పీడీ వెంకట్రామయ్య, ఏపీ కమ్మసేవా సమితి జాయింట్ సెక్రెటరీ తమ్మినేని రమేష్, గోపి, అమిత్, మీనాక్షి నాయుడు, నాగిరెడ్డి, శేఖర్, నాగేశ్వర రావు, గుమ్మల్ల పుల్లారెడ్డి, విజయశేఖర్, చంద్రశేఖర్, మాధవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



2026 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమ్మసంఘం నాయకులు

నామినేటెడ్ పోస్టుల్లో బలిజలకు ప్రాధాన్యం



ఐక్యత చాటుతున్న బలిజసంఘ పెద్దలు

వన భోజనోత్సవంలో మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బలిజ కులస్థులకు నామినేటెడ్‌పోస్టులతో పాటు, అన్ని అంశాల్లోనూ కూటమి ప్రభుత్వం తగు ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న విజ్ఞాన పీఠం పాఠశాల ప్రాంగణంలో మహాబలిజ వనభోజన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కార్తీక వనభోజనాలు, సమావేశాలు కులస్థుల మధ్య బంధాన్ని బలోపేతం చేస్తాయన్నారు. అందరూ కలిసికట్టుగా ఉండే ఏదైనా సాధించవచ్చని అన్నారు. కర్నూలులో కాపు భవన్ నిర్మాణానికి తమ సొంత నిధులు కోటి రూపాయలు కేటాయించి ఆగిపోయిన నిర్మాణాన్ని పునఃప్రారంభించామని తెలిపారు. అనంతరం మంత్రిని ఘనంగా సత్కరించారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాపు సంఘాలన్నింటినీ ఏకం చేసి ఒకే బలమైన కాపు సంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం శాస్త్రీయనృత్యాలు, ఆటల పోటీలు అలరించాయి. ఇటీవల ఉద్యోగం సాధించిన టీచర్లకు, పోలీసులకు సన్మానాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం డైరీని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఐటీ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ లీలా కోటేష్ బాబు, బలిజ సంఘం పెద్దలు ఆర్జా రామకృష్ణ, కళారత్న పత్తి ఓబులయ్య, అనంత నాయుడు, ఉలిందకొండ వెంకటరమణ, లక్ష్మీనారాయణ, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ కుల్లాయప్ప, విజయభాస్కర్, రామస్వామి, నారాయణరెడ్డి, కర్నూలు నగర బలిజ సంఘం అధ్యక్షులు గాండ్ల లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ప్రధాన సలహాదారు సోమశేఖర్, ఈశ్వర్‌కుమార్, సహదేవుడు, ప్రకాష్, రామిరెడ్డి, శోభన్‌బాబు, మురళి, మధు తదితరులు పాల్గొన్నారు.

మెయిన్స్ పరీక్షలకు ఉచిత కోచింగ్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ, డా.బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ సిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు అర్హులు అని తెలిపారు. ఈ నెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో Https:apstudycircle.apcfss.in దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మొత్తం 340 సీట్లు ఉండగా ఇందులో విజయవాడలో 120, విశాఖపట్నంలో 100, తిరుపతిలో 120 సీట్లు ఉంటాయన్నారు. పూర్తిగా రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 30వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్, డిసెంబరు 10వ తేదీన కోచింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు.

ఆదోనిలో యువనేత దౌర్జన్యకాండ

● బాలికపై వేధింపులు

● ఫిర్యాదుకు వెళ్తున్నవారిపై దాడి

● పలువురికి తీవ్రగాయాలు

● ఇరువర్గాలు ఫిర్యాదు

● పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

ఆదోని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి చెందిన ఓ యువనేత దౌర్జన్యకాండకు ఆజ్యం పోశాడు. మొదట బాలికను వేధింపులకు గురి చేశాడు. అనంతరం వారు ప్రజాప్రతినిధికి ఫిర్యాదు చేసేందుకు వెళ్తుండగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదోని పట్టణంలో ఉత్కంఠ వాతావరణాన్ని సృష్టించింది. త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన బీజేపీ యువనేత మహేష్‌యాదవ్ కొంతకాలంగా ఓ మైనర్ బాలికను వేధింపులకు గురి చేస్తున్నాడు. వేధింపులు శృతిమించడంతో 10 రోజుల క్రితం ఇరుకుటుంబాల మధ్య పంచాయితీ జరిగింది. బాలికను వదిలేయాలని, వేధింపులు ఆపాలని పెద్దలు చెప్పడంతో అప్పటికి వివాదం సద్దుమణిగింది. అతడు మళ్లీ ఆ అమ్మాయి వెంట పడడం, వేధింపులు కొనసాగించడంతో బాలిక కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వేధింపులను తట్టుకోలేక ఈ విషయాన్ని ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే పార్థసారథిని కలిసి ఫిర్యాదు చేసేందుకు శనివారం బయలుదేరారు. బాలిక కుటుంబీకులు ఎమ్మెల్యే ఇంటికి వెళ్తున్నారన్న విషయం తెలుసుకున్న అతడు ఆఘమేఘాల మీద అక్కడికి చేరుకున్నాడు. బాలిక కుటుంబ సభ్యులపై దాడికి యత్నించాడు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరి అది ఘర్షణకు దారితీసింది. మహేష్, అతని కుటుంబ సభ్యులు దాడికి పాల్పడగా, బాలిక కుటుంబీకులు ప్రతిఘటించారు. ఎమ్మెల్యే ఇంటి ముందే జరిగిన ఈ దాడిలో ఇరువర్గాలకు చెందిన పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు జోక్యం చేసుకుని ఘర్షణను ఆపడానికి ప్రయత్నించినప్పటికీ పరిస్థితి అదుపు తప్పింది. విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగడంతో పంచాయితీ త్రీటౌన్ పోలీస్‌స్టేషన వరకు చేరింది. పోలీసులు ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈవిషయంపై త్రీటౌన్ సీఐ రామలింగమయ్యను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, మహేష్‌నాయక్ అనే యువకుడు మైనర్ బాలికను వేధించినట్లు ఫిర్యాదు చేయడంతో పోక్సో చట్టం కింద మహేష్‌తో పాటు అతడి తమ్ముడు, తల్లిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైనర్ బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మాజీ సమితి అధ్యక్షుడు మునిశేషిరెడ్డి మృతి

● పలువురి సంతాపం



మునిశేషిరెడ్డి(ఫైల్)

పాణ్యం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల మాజీ సమితి అధ్యక్షులు నల్లల మునిశేషిరెడ్డి(96) ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. శనివారం రక్తపోటు పెరిగి తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుమారుడు కౌలూరు ఎంపీటీసీ నల్లల విజయ భాస్కరరెడ్డి తెలిపారు. 30 ఏళ్ల పాటు కౌలూరు గ్రామ సర్పంచ్‌గా కొనసాగిన ఆయన 1929 జూన్ 29న కౌలూరుకు చెందిన నల్లల నాగిరెడ్డి, నాగమ్మ దంపతులకు జన్మించారు, ఐదో తరగతి వరకు కౌలూరు ప్రాథమిక పాఠశాలలో, ఎస్ఎస్ఎల్‌సీ పాణ్యం జిల్లా బోర్డు పాఠశాలలో చదివారు. 1979లో నంద్యాల సమితి అధ్యక్షుడిగా కొనసాగారు. టీడీపీలో చేరి దివంగత ఎన్టీఆర్‌కు సన్నిహితుడిగా మారారు. బలపనూరు సమీపంలో నిర్మించిన నూలు మిల్లు చైర్మన్‌గా, శ్రీశైలం ట్రస్టు బోర్డు సభ్యులుగా పని చేశారు. ఈయన సర్పంచ్‌గా గ్రామాన్ని తీర్చిదిద్దారు. రాష్ట్రస్థాయిలో రెండు సార్లు ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు అందుకున్నారు. ఆయనకు ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తెలుగుదేశం పార్టీకి తన వంతు సేవలు చేశారు. ఆయన మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామంలో సాయంత్రం జరిగిన అంత్యక్రియలకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పలువురు ప్రముఖుల సంతాపం

రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితా, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మునిశేషిరెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. దూరప్రాంతంలో ఉండడంతో పెద్దాయన భౌతికకాయాన్ని సందర్శించలేకపోయామని ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, శాంతిరాం వైద్యశాల ఎండీ మిద్దె రఘురాం ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ కడప చైర్మన్‌గా వెంకటేశ్వర్లు

● ప్రమాణస్వీకారం చేసిన నూతన పాలకవర్గం



ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్ కడప చైర్మన్‌గా ఎంపికైన ఇంజనీర్ ఎ.వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు

కడప (ఎడ్యుకేషన్), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) కడప జిల్లా అధ్యక్షుడిగా ఏవీఆర్ టెక్నో స్కూల్స్ అధినేత ఇంజనీర్ ఎ.వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. ఆ శాఖ కార్యాలయంలో ఆదివారం జరిగిన 36వ సర్వసభ్య సమావేశం సందర్భంగా కొత్త పాలకవర్గాన్ని ఎన్నుకున్న అనంతరం బాధ్యతలు స్వీకరించారు. గౌరవ కార్యదర్శిగా సహాయ గనుల అధికారి ఇంజనీర్ ఎం.వెంకటేశ్ బాధ్యతలు చేపట్టారు. పాలకవర్గ సభ్యులుగా వైపీ వెంకటరమణయ్య, బి.వేణుగోపాల్, గంజికుంట గణేశ్, విపిన్ కుమార్ శర్మ, ఆర్.నరేంద్రరావు, డి.లక్ష్మీపతి, వై.వెంకటరమణ, జి.కృష్ణకిషోర్, కె.ప్రసాద్, ఎం.షెహనాజ్, టి.లక్ష్మీభాస్కర్, ఓ.వాసుదేవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నూతన చైర్మన్ ఇంజనీర్ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ కడప కేంద్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గౌరవ కార్యదర్శి ఇంజనీర్ ఎం.వెంకటేశ్ మాట్లాడుతూ ఎలాంటి వివక్ష లేకుండా సెంటర్‌ను అభివృద్ధి దిశగా ముందుకు నడిపిస్తానని తెలిపారు. నూతన పాలకవర్గ సభ్యుల సమక్షంలో మాజీ చైర్మన్ డాక్టర్ వి.ఆదినారాయణరెడ్డి నూతన చైర్మన్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ చైర్మన్లు, మాజీ గౌరవ కార్యదర్శులు, సభ్యులు తదితరులు కొత్తగా ఎన్నికైన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

కౌలు రైతు బలవన్మరణం

ఓర్వకల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నన్నూరు గ్రామానికి చెందిన రైతు కల్లెం బాలరాజు(35) బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలివీ.. బాలరాజు తనకున్న ఎకరా పొలం, మరో ఎకరా పొలాన్ని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్నారు. ఐదేళ్లలగా మొక్కజొన్న, పత్తి, పప్పు శనగా సాగు చేస్తూ వచ్చారు. సాగు కోసం రూ.6లక్షలు అప్పుడు చేశారు. ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఓర్వకల్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. బాలరాజు తండ్రి చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తిప్పాయపల్లెలో నాలుగిళ్లలో చోరీ

ఓర్వకల్లు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాయపల్లెలో ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని దొంగలు నాలుగిళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఇళ్లలో ఎవరూ లేని సమయంలో చోరీ చేసినట్లు గ్రామ స్థులు తెలిపారు. గ్రామానికి చెందిన మహమ్మద్ బాషా ఇంట్లో బీరువా పగులకొట్టి దుస్తులన్నీ చిందర వందరగా చేసి అందులో ఉన్న రూ.20 వేల నగదును దోచుకెళ్లారు. శేఖర్ రెడ్డి ఇంట్లో రూ.30వేలు, వడ్డె రవి ఇంట్లో రూ.1,500, కురువ అంకన్న ఇంట్లో 15 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు చేయడంతో పోలీసులు చోరీ జరిగిన ప్రాంతాలను పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యేలు



మాజీ ఎమ్మెల్యేలను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

మహానంది, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని మహానంది క్షేత్రంలో ఆదివారం శ్రీశైలం, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, కాటసాని రామిరెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. కల్యాణమంటపంలో వీరిని వేదపండితులు ఆశీర్వదించి, సన్మానించారు. వీరివెంట వైసీపీ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, పరిశీలకులు కొండా మధుసూదన్‌రెడ్డి, జయసింహారెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

రబీ పంటలకు యూరియా కొరత ఉండదు

మహానంది, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు రబీ సీజన్‌లో సాగు చేసే పంటలకు యూరియా కొరత ఉండదని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం మహానందిలో డీఏవో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రబీ సీజన్‌లో ముఖ్యంగా వరి పంట సాగు చేసే రైతులు కొన్ని సూచనలు పాటించాలన్నారు. ఆదునీక వ్యవసాయ పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడితో పాటు అధికలాభాలను రైతులను సాధించవచ్చునన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రణాళిక ప్రకారం రైతులకు యూరియాను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి ,సిబ్బంది పాల్గొన్నారు.

రేపు లక్ష బిల్వార్చన

నంద్యాల కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18న కార్తీకమాసం మాస శివరాత్రి సందర్భంగా పట్టణంలోని బ్రహ్మనందీశ్వరాలయంలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఈవో లక్ష్మీనారాయణ, అర్చకులు రాచకొండ మురళీక్రిష్ణ, కృష్ణగిరి సురేష్ శర్మ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ మంగళవారం వేకువజామున రుద్రాభిషేకం, స్వామివారిక లక్షబిల్వార్చన, అమ్మవారికి లక్షకుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ఉత్సవమూర్తుల గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో తెలిపారు.

వీరశైవులందరూ సంఘటితం కావాలి

నంద్యాల కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వీరశైవులందరూ సంఘటితం కావాలని వీరశైవ సంక్షేమ సమాజం నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం నంద్యాలలోని బ్రహ్మనందీశ్వరాలయంలో కార్తీక ధాత్రి సమారాధన నిర్వహించారు. వీరశైవులు ఆలయంలో బ్రహ్మనందీశ్వరునికి పంచామృత అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. సభ్యులతో సమావేశం ఏర్పాటుచేసి వీరశైవ సంక్షేమ సంఘం అభివృద్ధిపై చర్చించారు. అనంతరం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు సాంబయ్య, శశిభూషణ సిద్ధాంతి, నాగమల్లయ్య, సభ్యులు వీరప్ప, హరీశ్, మల్లికార్జున, సీనప్ప, చంద్రశేఖర్, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి రూ.1.11లక్షలు విరాళం

పాణ్యం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అన్నదాన సత్రానికి భక్తులు రూ.1.11 లక్షలు విరాళంగా అందజేశారు. ఆదివారం గుంటూరుకి చెందిన భువనేశ్వరీ ట్రేడర్స్ అధినేత వనుకూరి శ్రీనివాసరెడ్డి, సుహాసిని దంపతులు, కుమార్తె తేజధర్మారెడ్డి, భువనికలు ఆలయ ఈవో రామకృష్ణకు విరాళాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధికై గోస్పాడు మండలం పసురుపాడు గ్రామానికి చెందిన చాకిరెడ్డి ఉమామహేశ్వరరెడ్డి రూ.20 వేలు అందజేశారు. ఆలయ మార్యాదలతో దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సురేష్ శర్మ, గ్రామ పెద్దలు, ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

నంద్యాల హాస్పిటల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో ఈ నెల 18న ఉమ్మడి కర్నూలు జిల్లా బేస్‌బాల్ అండర్-14, 17 బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్ కార్యదర్శులు బీవీ విశ్వనాథ్, జి.ఆశాజ్యోతి తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు క్రీడాకారులు పాల్గొనాలన్నారు. క్రీడాదుస్తులతో హాజరుకావాలన్నారు. క్రీడాకారులు అర్హత పత్రం, ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాసామగ్రి గ్లౌజ్‌లు, స్లగ్గర్, హెల్మెట్లు తెచ్చుకోవాలన్నారు.

19న సీనియర్ మహిళా, పురుషుల జిల్లా జూడో జట్ల ఎంపిక

నంద్యాల హాస్పిటల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతినగర్ స్టేడియంలో ఈ నెల 19న సీనియర్ మహిళా, పురుషుల జిల్లా జూడో జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జూడో సంఘం జిల్లా చైర్మన్ నిమ్మకాయల సుధాకర్ తెలిపారు. 15ఏళ్లు పైబడి వివిధ బరువుల కేటగిరీల్లో జిల్లా జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22, 23తేదీల్లో కాకినాడలో రాష్ట్ర స్థాయి సీనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు తీసుకు రావాలన్నారు. వివరాలకు 9704042143, 9703803114నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

కార్తీక శోభ

- మహానందికి పోటెత్తిన భక్తులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు
- కోనేర్లలో పుణ్యస్నానాలు

జిల్లా వ్యాప్తంగా ఆలయాల వద్ద కార్తీక శోభ సంతరించుకుంది. ఆదివారం మహానంది శైవ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులు తెల్లవారుజామునే ఆలయం ప్రాంగణంలోని కోనేర్లల్లో పుణ్య స్నానాలను ఆచరించారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే దర్శనం ఏర్పాటు చేయించారు. మహిళలు నాగులకట్ట, ద్వజస్తంభం వద్ద దీపాలను వెలిగించారు. కార్తీక చివరి సోమవారం క్షేత్రంలో మరింత భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. నంద్యాల పట్టణంలోని పలు శివాలయాలను భక్తులు దర్శించుకున్నారు. ప్రథమనంది, నాగనంది, సోమనంది, బ్రహ్మనందీశ్వరాలయం, సంజీవ నగర్‌రామాలయం, నాగులకుంటరోడ్డులోని నాగలింగేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉసిరి చెట్టుకింద దీపాలు వెలిగించి పూజలు చేశారు. బండిఆత్మకూరు మండలంలోని ఓంకారంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో పిల్లపాపలతో ఉదయం నుంచే భక్తులు తరలివచ్చారు. ముందుగా పంచబుగ్గల కోనేటిలో స్నానం ఆచరించి గంగా, ఉమా సమేత సిద్దేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. వృక్షంలో కొలువుదీరిన అభయాంజనేయుడికి ప్రదక్షిణలు చేశారు. ఎత్తైన కొండల్లో వెలసిన పద్మావతి సహిత శ్రీనివాస ఆలయాన్ని దర్శించుకున్నారు. భక్తులకు కాశిరెడ్డినాయన ఆశ్రమ సేవకులు అన్నదానం చేశారు. గడివేముల మండలంలోని దుర్గాభోగేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దుర్గాభోగేశ్వరుడికి, బాలత్రిపురాంబసమేత పాలకేశ్వరస్వామికి పూజలు చేశారు.

● ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్



గడివేముల: దుర్గాభోగేశ్వర ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



మహానంది కోనేరులో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు



మహానందిలో దర్శనం కోసం క్యూలో భక్తులు



బండిఆత్మకూరు: కాశిరెడ్డినాయన ఆశ్రమంలో భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న సేవకులు

ఐక్యతగా ఉండాలి

- మాజీ మంత్రి కేఈ ప్రభాకర్
- ఘనంగా కార్తీక వన భోజనోత్సవాలు

నంద్యాల రూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): గౌడ కులస్తులు ఐక్యతగా ఉండాలని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని కానాల బుగ్గ రామేశ్వర ఆలయంలో గౌడ కులస్తుల వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ పాల్గొన్నారు. వనభోజనాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మోహన్‌గౌడ్, లింగమయ్య, శేషాద్రిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నమాజీ మంత్రి కేఈ ప్రభాకర్

హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

నంద్యాల కల్చరల్: నంద్యాల హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మూలమఠంలోని ఉమ్మడి కర్నూలు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనిధి రఘువీర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం, కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీ హోటల్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర, జిల్లా ఆహార భద్రతాధికారి వెంకటరాముడు పాల్గొన్నారు. ఉసిరిక చెట్టుకు పూజలు చేసి వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం క్యూబికా స్కిల్స్ అకాడమీ వారు కంప్యూటర్ స్కిల్స్ పై అవగాహన, బాలభవన్ విద్యార్థులు నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లా హోటల్స్ అసోసియేషన్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

బంజారా కార్తీక వనభోజనాలు

నంద్యాల హాస్పిటల్: పట్టణంలోని ప్రథమనంది దేవస్థాన ఆవరణలో ఆదివారం బంజారా కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. బంజారా కులదేవతల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. బంజారా సంస్కృతి సాంప్రదాయాలతో చిన్నారుల ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ మాట్లాడుతూ బంజారాల ఐక్యతకు కార్తీక వనభోజనాలు దోహదపడతాయన్నారు. అనంతరం చిన్నారులకు బహుమతులు, అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణనాయక్, పుల్లన్న నాయక్, హత్తీరాం నాయక్, డా.కాంతారావునాయక్, నారాయణ నాయక్, లక్ష్మణ్‌నాయక్, జీపీఎస్ కార్యదర్శి రవినాయక్, జిల్లా అధ్యక్షుడు తిరుపాల్‌నాయక్, విద్యార్థి సంఘం నాయకులు రవీంద్రనాయక్, బద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రథమనందీశ్వరాలయంలో..

నంద్యాల కల్చరల్: నంద్యాలలోని ప్రథమనందీశ్వరాలయ ప్రాంగణంలో రజకుల వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి గుంటూరు-2 ఎమ్మెల్యే గల్లా మాధవి, రజక సంఘం మహిళా నాయకురాలు, కర్నూలు జిల్లా న్యాయాధికారి కబర్ధి, నంద్యాల జిల్లా న్యాయాధికారి రాజు, న్యాయమూర్తులు, పట్టణ కిరాణ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొని స్వామివారికి అభిషేకాలు, కేదారేశ్వరీదేవికి కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రథమనందీశ్వర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో చలంబాబు, అర్చకులు ప్రవీణ్‌కుమార్, మల్లిఖార్జున, వెంకటనారాయణ, రాజశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.



ప్రథమనందీశ్వరునికి అభిషేకం చేస్తున్న గుంటూరు-2 ఎమ్మెల్యే గల్లా మాధవి, రజకసంఘం నాయకురాలు



మాట్లాడుతున్న ఫుడ్‌సేఫ్టీ అధికారి వెంకటరాముడు



గణపతిస్వామిని సన్మానిస్తున్న బంజారా నాయకులు

శివాలయానికి నాగభరణం బహూకరణ

పగిడ్యాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బంగ్లా శివాలయంలోని సర్వేశ్వ ర స్వామికి నాగభరణం ఆదివారం బ హూకరించారు. గ్రామస్థుల స హకారంతో రూ. 75 వేల విలువ చేసే వెం డి నాగ భరణాని శివ లింగానికి అలంకరించారు. ఉదయం నుంచి పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. గ్రామస్థులు సత్యంరెడ్డి, మద్దిలేటి, బాల మహేశ్, లక్ష్మీరెడ్డి, దామోదర్‌రెడ్డి, నాగిరెడ్డి, వాసురెడ్డి, పుల్లయ్యగౌడ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నాగభరణం

గ్రంథాలయ ఉద్యమ నాయకులకు ఘననివాళి



నంద్యాలలో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న సాహితీవేత్తలు

నంద్యాల కల్చరల్/ పగిడ్యాల/పాములపాడు/పాణ్యం/బండిఆత్మకూరు/ నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం నంద్యాలలో నంద్యాల పింగళి సూరన స్మారకశాఖా గ్రంథాలయంలో, ఆయా మండలాల్లో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ఎస్.ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావుల చిత్రపటాలకు నివాళ్లు అర్పించారు. గ్రంథాలయల స్థాపనకు ప్రముఖులు చేసిన సేవలను విద్యార్థులకు తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో సాహితీ స్రవంతి సభ్యులు అన్నెం శ్రీనివాసరెడ్డి, డా. నీలం వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, గ్రంథాలయ ఇన్‌చార్జి శ్రీధర్, గ్రంథాలయాల అధికారులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పని చేస్తున్న స్వీపర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డిపో ఆవరణలో స్వీపర్ల సమావేశం రామసుబ్బమ్మ అధ్యక్షతన నిర్వహించారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ స్వీపర్లు చాలీచాలని వేతనాలతో వెట్టి చాకిరీ చేస్తున్నారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల దృష్ట్యా వేతనాలు సరిపోవడం లేదన్నారు. స్వీపర్లకు బ్లౌజులు, మాస్కులు, శానిటైజర్లు, యూనిఫామ్, స్వీపర్లకు పనిముట్లు ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు లచ్చమ్మ, నాగేంద్రమ్మ, పుల్లమ్మ, పల్లవి, రాజమ్మ, ఏసన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న శాలివాహనులు



వేదికపై మాట్లాడుతున్న శ్రీశైల మండలం అధ్యక్షుడు శ్రీను

శ్రీశైలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి చెందుతున్న అన్ని రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని శాలివాహనులు కూడా పోటీ పడుతుండటం అభినందనీయమని కుమ్మరి సంఘం శ్రీశైలం మండల అధ్యక్షుడు శ్రీను అన్నారు. ఆదివారం శ్రీశైలం శాలివాహన కుమ్మరి సత్ర సంఘం అధ్యక్షుడు బండారి భిక్షపతి ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు సాంప్రదాయ దుస్తులతో హాటకేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహర్షి ఆశ్రమంలో జరిగిన వనభోజన కార్యక్రమంలో కార్యదర్శి నాగేశ్వరరావు, నాగదేవేంద్ర, శివకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికోసమే చండీయాగం

- సాయి సచ్చిదానంద ఆశ్రమం గురూజీ సాయిరాం

మహానంది, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి కోసమే మహానందిలో చండీయాగం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా సాయి సచ్చిదానంద ఆశ్రమం గురూజీ సాయిరాం తెలిపారు. మహానంది క్షేత్ర పరిధిలోని అఖిల భారత నిత్యాన్నదాన కరివెన సత్రం ఆవరణలో ఆదివారం సాయిరాం గురూజీ ఆధ్వర్యంలో ఋత్వికులు వైభవంగా చండీహోమంతో పాటు ప్రత్యేక పూజలను వేదమంత్రాలతో నిర్వహించారు. ఈ ఏడాది మహానందిలో చండీ హోమంను మూడు రోజుల పాటు నిర్వహిస్తారని గురూజీ తెలిపారు. ఈకార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.



మహానందిలో చండీయాగం నిర్వహిస్తున్న రుత్వికులు

బిహార్ ఎన్నికలను రద్దు చేయాలి

- ఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పోతుల నాగరాజు

నంద్యాల హాస్పిటల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థను విచ్ఛిన్నం చేసేవిధంగా రాజ్యాంగ వ్యవస్థలను వాడుకొని కేంద్ర ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ అజెండాతో అమలు చేసిన బిహార్ ఎన్నికలను రద్దుచేయాలని రిజర్వేషన్ పరిరక్షణ సమితి (ఆర్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో బహుజనులను రాజకీయంగా అంతంచేసే కుట్ర జరుగుతోందని, మనువాదుల కుట్రలు, కుతంత్రాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. బహుజన నాయకుల చేతిలో ఉన్న బీఎస్పీ, ఎస్పీ, ఆర్జేడీ, డీఎంకే లాంటి పార్టీలకు అధికారం దక్కకుండా కుట్రలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఇందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలనే దళారులుగా వాడుకొని బహుజన రాజకీయ పార్టీలను అంతం చేసే దిశగా కుట్రలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో ఆర్‌ఈఎఫ్ జాతీయ నాయకులు జి.నాగభూషణం, జి.శ్రీనివాసులు, ఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పెరుగు శివకృష్ణ, నంద్యాల జిల్లా అధ్యక్షుడు బిజినవేముల శ్రీనివాసులు, డీఎస్ ఆర్పీఎస్ నాయకులు సుబ్బయాదవ్, హుసేన్, వెంకటేష్, ఆదినారాయణ, బజారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పోతుల నాగరాజు

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వర్‌రావు
- నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు

మిడుతూరు/పగిడ్యాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఖాజీపేట గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి నందికొట్కూరులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షల పోస్టర్‌ను ఆవిష్కరించారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని దీక్షలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు ఓబులేసు, రైతులు వెంకటేశ్వర్లు, ప్రతాప్ రెడ్డి, సీతారామి రెడ్డి పాల్గొన్నారు. పగిడ్యాల మండలం సంకిరేణిపల్లెలో సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్‌సాహెబ్ ఆధ్వర్యంలో రిలే దీక్షల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో రైతులు తిక్కస్వామి, వెంకటస్వామి, మద్దిలేటి, రవి, లక్ష్మయ్య తదితరులున్నారు.

జరిమానాలు విధించడం సరికాదు

శ్రీశైలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ నిషేధం అమలును అడ్డుపెట్టుకుని యాత్రికుల నుంచి జరిమానాల రూపంలో ముక్కుపిండి వసూలు చేయడం సరికాదని బీజేపీ మండలాధ్యక్షుడు చదువుల శ్రీను అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కార్తీక మాసం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న టూరిస్ట్ బస్సులు, వ్యాన్లలో మంచినీటి ప్లాస్టిక్ బాటిళ్లు అటవీ ప్రాంతంలోనికి తీసుకురాకూడదని అవగాహన కల్పించాలన్నారు. అలా చేయకుండా కేవలం ఫైన్లు వేయడం తగదన్నారు. పొరుగు రాష్ట్రాలకు చెందిన వాహనాలను ఎక్కువగా టార్గెట్ చేసి వేలాది రూపాయలు వసూలు చేయడంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

పాత్రికేయుల సేవలు ఎనలేనివి

వెలుగోడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా ఉండి సేవలందిస్తున్న పాత్రికేయుల సేవలు ఎనలేనివని ఎస్‌డీపీఐ నాయకులు అన్నారు. జాతీయ పాత్రికేయుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో మండలం లోని పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. సమావేశంలో ఎస్‌డీపీఐ నాయకులు ఆరీఫ్, మహ్మద్ గౌస్, షఫీ, తౌసిఫ్, ఫజులుల్లా, బాషా, మున్ని తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

శ్రీశైలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం పరిసరాల్లో పేకాడుతున్న జూదరులను అరెస్టు చేసినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. ఆదివారం అవుటర్ రింగ్‌రోడ్డుకు సమీపంలో నలుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అసాంఘిక కార్యకల్పాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ నాయకులు షబ్బీర్ అహ్మద్, వలి, ఖాసీం కోరారు. ఆదివారం ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్నామని, పనికి తగిన వేతనం ఇవ్వడం లేదని, ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక పరమైన సంక్షేమ పథకాలు అందడం లేదని అన్నారు. హెచ్ఆర్ పాలసీని అమలు చేస్తూ సమాన పనికి సమాన వేతనం మంజూరు చేయాలని కోరారు. పదవీ విరమణ 60 నుంచి 62కు పెంచాలని, మెడికల్ బిల్లులు, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయుటకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న డీఎల్‌సీవో రుక్సానాబేగం

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యమని నంద్యాల డివిజన్ సహకార సంఘ అధికారి రుక్సానా బేగం అన్నారు. ఆదివారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో సింగిల్‌విండో అధ్యక్షుడు ఉసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సహకార సంఘం వారోత్సవాల జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు రామసుబ్బయ్య, శేఖర్‌రెడ్డి, సబ్‌డివిజనల్ కో-ఆర్డినేటర్ నాగరాజు, సీఈవో ఉసేన్‌మియా, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ ఇండ్ల లక్ష్మీరెడ్డి, టీడీపీ నాయకులు రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, సహకార సంఘ ఉద్యోగులు పాండు, కుమార్, దిపక్, ఉపేంద్ర, నరేష్, రామకృష్ణ, వెలుగు సీసీ దిల్షాద్, బెస్త సంఘ సభ్యులు, పొదుపు మహిళలు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊటకొండ గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు జయన్న(57) ఆదివారం తమ నివాసంలో గుండె పోటుతో మృతి చెందారు. జయన్న ఊటకొండ పంచాయితీలో పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి జయన్న మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. జయన్న కుటుంబానికి అండగా ఉంటామన్నారు. టీడీపీ నాయకులు వై లక్ష్మీనారాయణయాదవ్, సుదర్శన్, సతీష్ తదితరులు కోట్ల వెంట ఉన్నారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎంపిక

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు చంద్రశేఖర్, నాగేంద్రకుమార్ తెలిపారు. ఆదివారం ఎస్టీయూ కార్యవర్గం మండల అధ్యక్షులుగా గురుచంద్రుడు, ప్రధాన కార్యదర్శి మస్తాన్‌బాషా, ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్ ఎన్నికయ్యారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మౌలాలి, అజామ్‌బేగ్, రాష్ట్ర నాయకులు శివశంకర్, ప్రసాదురెడ్డి, చంద్రశేఖర్, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

కూటమితోనే పేదలకు సంక్షేమ పథకాలు

కోవెలకుంట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని ఉమ్మడి కర్నూలు జిల్లా ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్‌ఏ గఫూర్ అన్నారు .ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ సమర్థవంతంగా పాలన చేస్తూ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు.

నేటినుంచి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

బనగానపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని పసుపుల గ్రామ సమీపంలో వెలసిన గుండం మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయధర్మకర్త ఆకుల సిద్ధేశ్వరప్ప తెలిపారు. ఈపోటీలు మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు, బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో, ఐదో బహుమతులుగా రూ.60 వేలు, రూ.50వేలు, రూ.30వేలు, రూ.30వేలు, ఐదో బహుమతిగా రూ.20వేలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

ముగిసిన క్రీడా పోటీలు

డోన్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాయలసీమ యూనివర్సిటీ అంతర్ కళాశాలల పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో ఫుట్‌బాల్ పోటీల్లో విన్నర్‌గా ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, రన్నర్స్‌గా రాయలసీమ యూనివర్సిటీ కాలేజీ, చెస్ విన్నర్స్‌గా రాయలసీమ యూనివర్సిటీ కాలేజీ, రన్నర్స్‌గా కర్నూలు సెయింట్ జోసెఫ్ డిగ్రీకాలేజీలు నిలిచాయి. ఈ పోటీల్లో ఫుట్‌బాల్ 5 టీములు, చెస్‌కు 7టీములు పాల్గొన్నాయి.

వైభవంగా విష్ణుసహస్ర పారాయణం

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని రామలింగేశ్వర, కోదండరామాలయాల్లో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం మహిళలు సామూహికంగా విష్ణుసహస్ర పారాయణం చేశారు. శివపార్వతులకు పండ్లు, పూలతో అలంకరింప చేశారు. 108 దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. శివపార్వతుల పల్లకి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



నేలంపాడు గ్రామ సమీపంలో పంట పొలాల్లోనే నిలిచిన వరద నీరు

నీరు పోనంటోంది.. బాధ తీరదంటుంది!

- 40 రోజులుగా పొలాల్లోనే వరద
- కుళ్లిపోయిన పంటలు
- తీవ్రంగా నష్టపోయిన రైతులు
- ఏ పంట సాగుకు రాని వైనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలంపాడు, గొట్లూరు గ్రామాల్లోని పొలాల్లో వరద నీరు తగ్గడం లేదు. రైతులు అవస్థలు పడుతున్నారు. 40 రోజులు గడిచినా వరద పొలాల్లోనే ఉండటంతో చెరువుల్లా దర్శనమిస్తోంది. మొక్కజొన్న, బెండ, మినుము, జూట్ పంటలు నీటిలోనే కుళ్లిపోయాయి. శనగ పంట సాగు చేసేందుకు కూడా వీలు లేకపోయింది. దాదాపు 500 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని రైతులు కన్నీరుమున్నీరయ్యారు. పంట పొలాల్లో వరద నీరు ప్రవహిస్తే పొలాలు ఏ పంట సాగు చేసుకునేందుకు వీలులేకుండా తయారవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో వరద ప్రవహించకుండా శాశ్వత పరిష్కారం చూపాలని పాలకులు, అధికారులను పలు మార్లు కోరినా పట్టించుకునే వారే కరువయ్యారని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పంట పొలాల్లో నిలిచి ఉన్న వరద నీరు పోయేలా చర్యలు తీసుకొని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు వీలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.



గొట్లూరు గ్రామ సమీపంలో నల్లబారిన బెండ పంట

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి డి.మౌలాలి, అజామ్‌బేగ్ అన్నారు. ఆదివారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో మండల అధ్యక్షుడు మస్తాన్‌బాషా అధ్యక్షతన 79వ వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన 11వ వేతన సవరణ బకాయిలు, కేంద్ర ప్రభుత్వంతో సమానంగా కరువు భత్యాలు, అరియర్స్, పదవీ విరమణ చివరి ప్రయోజనాలు, సరెండర్ లీవ్, రుణాలు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలు గత రెండు దశబ్ధాలుగా లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అవుతుంటే మరోకవైపు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ పాస్ కావాలంటూ నిబంధనను తొలగించాలన్నారు.అనంతరం 2025 ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర పైలక మిటీ కన్వీనర్ చంద్రశేఖర్, వెబ్ కన్వీనర్ నాగేంద్రకుమార్, రాష్ట్ర మాజీ అదనపు కార్యదర్శి ప్రసాదురెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వరబాబు, రమేష్‌బాబు, ఆర్థిక కార్యదర్శి శివప్రసాద్, జిల్లా సహ అధ్యక్షులు అమీర్, అదనపు కార్యదర్శి ఉస్మాన్, జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, మండల కార్యదర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్, ఎస్టీయూ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మౌలాలి

వైభవంగా నైనాలప్ప ఉత్సవాలు

సంజామల,నవంబరు 16,(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటైన నైనాలప్ప క్షేత్రంలో ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు స్వామివారికి పూజలుచేసి నైవేద్యాలు సమర్పించారు. రాత్రి హరికథ, కోలాటం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్ ఆధ్వర్యంలో ఎస్.ఐలు రమణయ్య, మల్లికార్జున రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బండలాగుడు పోటీలు



బండలాగుతున్న ఎద్దులు

నైనాలప్ప ఉత్సవాల సందర్భంగా ఆదివారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 19 జతల ఎద్దులు పాల్గొన్నాయి. కడప జిల్లా జమ్మలమడుగు టౌన్ మారం రెడ్డి మహేశ్వర రెడ్డి ఎద్దులు ప్రథమ విజేతగా నిలిచాయి. ద్వితీయ స్థానంలో నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్. కొత్తూరు సర్పంచ్ బీరం శేషారెడ్డి ఎద్దులు, తృతియస్థానంలో నంద్యాల జిల్లా సంజామల మండలం ముక్కమళ్ల గ్రామానికి చెందిన మూసాని చంద్రశేఖర్‌రెడ్డి కంబైన్డ్ ఎద్దులు, నాల్గవ స్థానంలో తెలంగాణ రాష్ట్రం వనపర్తి మండలం రేవల్లి గ్రామానికి చెందిన రవీంద్ర ఎద్దులు, ఐదవ స్థానంలో నంద్యాల జిల్లా సంజామల మండలం ఆకుమళ్ల గ్రామానికి చెందిన కాకర్ల నాగజ్యోతి ఎద్దులు విజేతలుగా నిలిచాయి. విజేతలకు ఆలయ కమిటీ నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు.

ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు మృతి

అవుకు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు తాళేపల్లి బలరామయ్య (74) ఆదివారం మృతి చెందాడు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో మృతి చెందాడు. బలరామయ్య మృతి పట్ల పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారధి రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరరెడ్డి, టీడీపీ నాయకులు గూడాల ప్రతాప్‌రెడ్డి, మురళీధరరెడ్డి, ఉగ్రసేనారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.



బలరామయ్య (ఫైల్)

గ్రంథాలయాలు.. జ్ఞాన భాండాగారాలు



గాడి చెర్ల హరి సర్వోత్తరమరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

బనగాన పల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలు అని గ్రంథాలయాధికారి మధుశేఖర్ తెలిపారు, ఆదివారం గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ పితామహుడు , స్వాతంత్ర్య సమరయోధుడు గాడిచెర్ల సర్వోత్తమరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, పత్రికా రచయితగా, సాహితీ కారుడుగా గ్రంథాలయోధ్యనాయకుడిగా తెలుగుజాతికి ఆయన అందించిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అరుణ గీతామని, శరత్‌బాబు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బేతంచెర్ల శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కోసం కృషి చేసిన పాతూరి నాగభూషణం, అయ్యాంకి వెంకట్రామయ్య, ఆర్ఎస్ రంగనాథ్‌గార్ల చిత్రపటాలకు బేతంచెర్ల గ్రంథాలయ అధికారి మధు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మధుశేఖర్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి అఖిలాబేగం అన్నారు. ఆదివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు ఎస్ఆర్ రంగనాథన్, పోతూరి నాగభూషణం, ఐఎస్‌జీ వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, విద్యార్థులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

డోన్ రూరల్: పట్టణంలోని గ్రంథాలయ కార్యాలయంలో ఆదివారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాలను పురస్కరించుకుని గ్రంథాలయ ఉద్యమకారులైన గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణ, ఎస్ఆర్ రంగనాథ్‌ల చిత్రపటానికి పూలమాలలు, వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి రాధాబాయి, పాఠకులు పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కులను సాధించుకుందాం



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న వాల్మీకులు

డోన్ టౌన్/డోన్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులంతా ఐక్యతతో హక్కులు సాదించుకుందామని రాష్ట్ర వాల్మీకి, బోయ కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, డీఐపీఎంఐఎస్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.బి.మాధవక్రిష్ణ, వాల్మీకి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఉంగరానిగుండ్ల చిన్నమద్ది అన్నారు. ఆదివారం పట్టణ సమీపంలోని దొరపల్లె లక్ష్మీనరసింహ స్వామి ఆలయకండపై జరిగిన వాల్మీకి వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి బోయ కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చేవరకు అందరం ఐక్యతతో ఉండి పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వలసల సుధాకర్, మిద్దెపల్లి గోవిందు, చనుగొండ్ల శ్రీరాములు, వాల్మీకి సంఘం నాయకులు ఈశ్వర్‌నాయుడు, మల్యాల సురేష్ నాయుడు, న్యాయవాది శివరామకృష్ణ, ఆర్మీ రామయ్య, బొంతిరాళ్ల తిరుపాలు, అభిరెడ్డిపల్లె గోవిందు, పాలరాజు, దొరపల్లె మల్లికార్జున, విజయమోహన్ నాయుడు, యాగంటి మధు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సహంగా ఆర్యవైశ్యుల వన భోజనోత్సవం

ప్యాపిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆదివారం ఆర్యవైశ్యులు కార్తీక వన భోజనోత్సవం ఘనంగా నిర్వహించారు. అన్నపూర్ణాదేవి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాజా మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్తీక వనభోజనాల కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్యాపిలిలో అన్నపూర్ణాదేవికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నికలు నిలిపివేత

ఆళ్లగడ్డ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల విజయడైరీ పరిధిలోని నగల్లపాడు, రుద్రవరం, గడివేముల, వీరారెడ్డిపల్లె, ఆర్.పాంపల్లి, కోవెలకుంట్ల గ్రామాలలో నిర్వహించాల్సిన పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఎన్నికలను రద్దు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘానికి ఎవరు నామినేషన్ వేయకపోవడంతో ఎలక్షన్ రద్దు చేసినట్లు వారు తెలిపారు. లాఅండ్‌ఆర్డర్ కారణాల వల్ల ఆయా గ్రామాల్లో జరగాల్సిన ఎన్నికలు తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు వారు వివరించారు.

నేటి నుంచి కుష్టు వ్యాధి నివారణకు సర్వే

కొలిమిగుండ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సోమవారం నుంచి కుష్టు వ్యాధి నివారణ కోసం సర్వే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు కొలిమిగుండ్ల ప్రభుత్వ వైద్యులు డా.హరిచరణ్‌రెడ్డి పేర్కొన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తారని అన్నారు. అనుమానాస్పద లక్షణాలు కలిగిన వారికి ఆసుపత్రికి తీసుకవెళ్లి ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలందరూ ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

కొలిమిగుండ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు రహదారుల్లో ప్రయాణించే సమయంలో నిబంధనలు పాటించాలని సీఐ రమేష్‌బాబు అన్నారు. ఆదివారం కొలిమిగుండ్లలో వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించారు. ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

సతీశ్ కుమార్ హత్య కేసు సీబీఐకి అప్పగించాలి

డోన్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో సీఐగా పని చేస్తున్న కుమ్మర సతీశ్ కుమార్ హత్య కేసును సీబీఐతో విచారించాలని కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షుడు కుమ్మరి రాజు, ఉపాధ్యక్షుడు కుమ్మరి ఓబులేసు డిమాండ్ చేశారు. ఆదివారం పాతపేటలో వారు మాట్లాడుతూ పత్తికొండ చెందిన సీఐ దారుణ హత్యకు గురి కావడం చాలా బాధాకరమని, ఈ హత్యను ఖండిస్తూ సోమవారం ఉదయం కర్నూలు నగరంలో ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్, ఎస్పీలకు వినతి పత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని శాలివాహనలు పెద్ద ఎత్తున హాజరై సతీశ్ కుమార్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జయరాముడు, శేషు, కుమ్మరి ఓబులేసు, కుమ్మరి చిన్న గిడ్డయ్య, ఆంజనేయులు, బొంకూరి రవికుమార్, ఓబుళపతి, రమేష్, సరస్వతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాలివాహన సంఘం నాయకులు

దోషులను కఠినంగా శిక్షించాలి

కుమ్మరి శాలివాహన కులానికి చెందిన సీఐ కుమ్మరి సతీష్ కుమార్ మృతిని ఖండిస్తూ ఆ కేసును సీబీఐకి అప్పగించాలని కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుమ్మరి సుధాకర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలులోని కలెక్టరేట్ ముందు జరిగే ధర్నా కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

డోన్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శిల్పా హాస్పిటల్‌లో ప్రభుత్వ ఆసుపత్రి అసోసియేట్ ప్రొ.డా.మధుక్రిష్ణ, ప్రభుత్వ ఆసుపత్రి డా.రమ్య శిల్ప హాస్పిటల్‌లో సంతాన సాఫల్యానికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫెర్టిలిటి స్పెషలిస్టు డాక్టర్ విజయలక్ష్మీ హాజరై వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రశాంతత వాతావరణం, ఆత్మవిశ్వాసం,పౌష్టికాహారం, వైద్యుల సలహాలు సూచనలు వల్ల సంతానలేమి సమస్యలు అధిగమించవచ్చని తెలిపారు.

కల్వర్టుకు గండి



ముత్యాలపాడు రహదారిలో గండిపడ్డ కల్వర్టు

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు, డి.వనిపెంట గ్రామాలకు వెళ్లే రహదారిలో కల్వర్టు గండి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళలో ఆదమరిస్తే ప్రమాదాలకు గురి కావాల్సిందే. వర్షాల వల్ల కల్వర్టు దెబ్బతిని గండిపడింది. దీంతో రాకపోకలు చేసేందుకు రైతులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. పాలకులు, అధికారులు స్పందించి కల్వర్టు గండి మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకర మలుపులు

రుద్రవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆర్ అండ్‌బీ రహదారుల మలుపులు ప్రమాదకరంగా మారాయి. మండలంలోని హరినగరం, ముకుందాపురం, ఆలమూరు, చిత్తరేణిపల్లె గ్రామాల మలుపుల వద్ద సూచిక బోర్డులు లేవు. దీంతో ఇటీవల ప్రమాదాలు అధికమయ్యాయి. సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని అనేక సార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చిత్తరేణిలపల్లె సమీపంలో సూచికబోర్డులు లేని దృశ్యం

కంపు.. కంపు..



గుంతలో మురుగునీరు

రుద్రవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం గ్రామంలో ఫారెస్టు కార్యాలయానికి వెళ్లే నాలుగురోడ్ల కూడలిలో ఆర్‌అండ్‌బీ అధికారులు కల్వర్టు నిర్మించి గుంతను అలాగే వదిలేశారు. గుంతలో వర్షపు నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతను పూడ్చాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

సండే సందడి

కొలిమిగుండ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక కేంద్రం బెలుం గుహల్లో సండే సందడి నెలకొంది. కార్తీక మాసం ముగింపు రోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు పెద్ద ఎత్తున బెలుం గుహలకు తరలివచ్చారు. ప్రవేశ రుసుం ద్వారా ఆదివారం ఒక్క రోజే రూ.60వేలు ఆదాయం లభించినట్లు గుహల యూనిట్ మేనేజర్ వెల్లడించారు. గుహల్లోని ముఖ్య ప్రదేశాలైన పాతాళగంగ, వెయ్యిపడగలు, ఊడలమర్రి, సన్యాసి మఠం, కోటి లింగాలు తదితర ప్రాంతాలను సందర్శించి అబ్బురపడ్డారు.



గుహలోకి వెళ్తున్న సందర్శకులు